సాక్షి
కర్నూలు
శనివారం । 2 । నవంబర్ । 2024



అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన వంశీవికాస్ రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.



భ్రామరికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం సాయంత్రం అర్చకులు ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి పూజలు చేపట్టారు.



వేడుకగా నరకచతుర్దశి

మంత్రాలయం: రాఘవేంద్రస్వామి మఠంలో నరక చతుర్దశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నేతృత్వంలో గోవు, తులసి పూజలు చేపట్టారు.

ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కేడీసీసీబీ) మళ్లీ నష్టాలవైపు చూస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత సేవలు పడకేశాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 7 నెలలు గడిచిపోయాయి. నిధులకు ఎలాంటి కొరత లేకపోయినప్పటికీ రైతులకు రుణాలు పంపిణీలో ఎప్పుడూ లేని విధంగా బ్యాంకు వెనకబడిపోయింది. ఓవైపు రుణాల పంపిణీలో పురోగతి లేకపోవడం.. మరోవైపు రికవరీ నామమాత్రం కావడం.. ఇటు అవినీతి, అక్రమాలు పెరగడం.. అటు కమీషన్ల పర్వం జోరందుకోవడం.. ఇలా అన్నీ వెరసి లక్ష్యం గతి తప్పి బ్యాంకు నష్టాలకు చేరువవుతోంది.

లక్ష్యానికి దూరమై.. నష్టాలకు చేరువై!



ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయం

- తిరోగమనంలో ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు
- టర్నోవర్ లక్ష్యం తగ్గుతున్న వైనం
- బడ్జెట్ భారీగా ఉన్నా.. రుణాల పంపిణీ నామమాత్రమే
- రూ.330 కోట్లు విడుదలైనా పంపిణీ రూ. 2 కోట్లే

కర్నూలు(అగ్రికల్చర్): రైతులకు సకాలంలో రుణాలు అందించి అండగా నిలవాల్సిన కేడీసీసీబీలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో దశాబ్దాల నాటి నష్టాలను అధిగమించి లాభాల బాట పట్టిన బ్యాంకు నేడు మళ్లీ నష్టాల వైపు చూస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రుణాల పంపిణీ కోసం ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు బ్రాంచీలకు, పీఏసీఎస్‌లకు దీర్ఘ, స్వల్పకాలిక రుణాల పంపిణీ కోసం రూ.330 కోట్లు విడుదల చేసింది. ఈ బడ్జెట్ పూర్తి అయితే అదనంగా నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. బడ్జెట్ భారీగా ఉన్నప్పటికీ రుణాల పంపిణీ మాత్రం తూతూ మంత్రమంగానే సాగుతోంది. ఓ వైపు వాణిజ్య బ్యాంకుల్లో రుణాల కోసం రైతులు, ఇతర అన్ని వర్గాల ప్రజలు పోటెత్తుతున్నారు. రుణాల కోసం వచ్చే వారితో ఆ బ్యాంకులు కిటకిటలాడుతుంటాయి. జిల్లా సహకార కేంద్రబ్యాంకు బ్రాంచ్‌ల్లో మాత్రం అందుకు విరుద్ధమైన పరిస్థితి కనిపిస్తోంది. ఏటా జూలై నుంచి డిసెంబరు మూడవ వారం వరకే రుణాలు పంపిణీ చేస్తారు. ఆ తర్వాత రికవరీపై దృష్టి సారిస్తారు. రుణాల పంపిణీ కోసం రూ.330 కోట్ల బడ్జెట్ అన్ని బ్రాంచ్‌లకు, అన్ని పీఏసీఎస్‌లకు కేటాయించినప్పటికీ ఇప్పటి వరకు రుణాల పంపిణీ రూ.2 కోట్లలోపే ఉండటం గమనార్హం. ఈ ఆర్థిక సంవత్సరం 7 నెలలు ముగిసిపోయాయి. ఇక ఐదు నెలల్లో లక్ష్యాన్ని ఎలా చేరుకుంటారో బ్యాంక్ అధికారులకే తెలియాలి. ఇంతటి దారుణమైన పరిస్థితి ఎప్పుడూ లేదని బ్యాంకు వర్గాలే స్పష్టం చేస్తున్నాయి. బ్యాంకు అంటే రుణాల పంపిణీ, రికవరీలే ప్రధానం. కేడీసీసీబీలో మాత్రమే రుణాల పంపిణీ, రికవరీ సైతం లేక ఎన్‌పీఏ కొండలా పెరిగిపోతోంది.

రూ.4,600 కోట్ల టర్నోవర్ లక్ష్యం చేరుకునేదెట్లా?

2023–24 ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రూ.4,000 కోట్ల టర్నోవర్ దాటింది. 2024–25లో రూ.4,600 కోట్ల టర్నోవర్‌ను అధిగమించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ ఏడాది లక్ష్యాన్ని సాధించడం ఏమిటో కానీ.. 2023–24 టర్నోవర్‌ను నిలబెట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. గత ఏడాదితో పోలిస్తే ఇప్పటికే రూ.100 కోట్ల వరకు టర్నోవర్ తగ్గినట్లు తెలుస్తోంది. కొత్త రుణాల పంపిణీ లేకపోగా.. బకాయిలు పేరుకపోయి అవి నిరర్థక ఆస్తులుగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో బ్యాంకు పరువు బజారున పడినట్లు అయింది. ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బాగోగులను పాలకులు పట్టించుకోకపోగా... బ్యాంకు ద్వారా ఏ విధంగా తమ వారిని ఆర్థికంగా బాగు చేసుకోవచ్చనే దానిపైనే దృష్టి సారించడం గమనార్హం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించిన ఏజెన్సీ తమ అనుచరులకు ఇప్పించుకునేందుకు ఉమ్మడి జిల్లాలోని ఇద్దరు మంత్రులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో బ్యాంకు అధికారులకు దిక్కు తోచని పరిస్థితి ఎదురవుతోంది. బ్యాంకు అభివృద్ధిని మాత్రం పట్టించుకోవడం లేదు.

కొనసాగు..తున్న కంప్యూటరీకరణ

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కర్నూలు జిల్లాలో 43, నంద్యాల జిల్లాలో 56 ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే పీఏసీఎస్‌ల్లో కంప్యూటరీకరణ పూర్తి చేసి పారదర్శకంగా లావాదేవీలు నిర్వహించడానికి చర్యలు చేపట్టింది. 90 శాతం పీఏసీఎస్‌ల్లో అవినీతి, అక్రమాలు రాజ్యమేలు తున్నాయి. అక్రమాలకు చెక్ పెట్టేందుకే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంప్యూటరీకరణకు శ్రీకారం చుట్టింది. కంప్యూటరీకరణలో భాగంగా 2023–24లోనే ఫస్ట్‌హ్యాండ్ రిపోర్టు, ఫీల్డ్ వెరిఫికేషన్ రిపోర్టు పూర్తి అయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి డేటా క్యాప్చరింగ్ టూల్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో పీఏసీఎస్‌ల్లో సభ్యులైన బారొయింగ్స్ (రుణాలు పొందిన వారు), నాన్ బారోయింగ్స్ (షేర్ ధనం మాత్రం చెల్లించి రుణాలు పొందని వారు) వివరాలు, వారి భూముల వివరాలు, డిపాజిట్లు, అప్పుల వివరాలు సమగ్రంగా నమోదు చేయాలి. ఈ ప్రక్రియ ఫిబ్రవరి నుంచి కొనసాగుతూనే ఉంది. పీసీసీఎస్‌ల సిబ్బంది కంప్యూటరీకరణ అంటూ రుణాల పంపిణీని పూర్తిగా పక్కన పెట్టేశారు. కానీ ఇటు కంప్యూటరీకరణలో ప్రగతి లేదు... రుణాల పంపిణీ లేకుండా పోయింది.

పెరుగుతున్న అవినీతి అక్రమాలు...

కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ప్రతి ఒక్కరూ జవాబుదారితనంతో పనిచేస్తేనే బ్యాంకు ప్రగతి పథంలోకి వస్తుంది. కాని జవాబుదారితనం లేకపోగా.. ఎవ్వరికి వారు జేబులు నింపుకోవడానికి ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. బ్యాంకును ఉపయోగించి ఏ విధంగా సంపాదించుకోవచ్చనే దానిపై ఎక్కువ మందికి దృష్టి సారించినట్లు తెలుస్తోంది. చేయితడవనిదే ఏ పని చేయని వారు డీసీసీబీల్లో కోకొల్లలుగా ఉన్నారనే విమర్శలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత టీడీపీ నేతల అండదండలతో అక్రమార్జనకు పాల్పడేందుకు అనేక మంది ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఓ కీలకపోస్టులో ఉన్న అధికారి తాను, తన కుటుంబసభ్యులు ముఖ్యస్థానాల్లో ఉండి సంపాదించుకోవడానికి పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

నాడు రూ.10 కోట్ల లాభం..

నష్టాల ఊబిలో చిక్కుకున్న డీసీసీబీకి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఊపిరిపోసింది. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు కేడీసీసీబీ రుణాలు పంపిణీ చేసే ఏర్పాటు చేసింది. కస్టమ్స్‌హయ్యరింగ్ సెంటర్లు, మల్టీపర్పస్ గోదాముల నిర్మాణాలకు డీసీసీబీ రుణాలు అందజేసింది. గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల ఫలితంగా బ్యాంకు లోనింగ్ భారీగా పెరిగింది. ఆ సమయంలో దశాబ్దాల నాటి నష్టాలను అధిగమించి నికర లాభాల్లోకి వచ్చింది. ఏకంగా రూ.10 కోట్లు లాభం ఆర్జించగా.. సభ్యులైన పీఏసీఎస్‌లకు రూ.4 కోట్లు డివిడెంట్ ఇచ్చింది. దీంతో కేడీసీసీబీ నికర లాభాల్లోకి వచ్చింది. రాయలసీమ జిల్లాల్లోనే అత్యధిక టర్నోవర్ కలిగిన బ్యాంకుగా వరుసగా రెండేళ్లు అవార్డు కూడా అందుకుంది. నికర లాభాల్లోకి వచ్చిన కేడీసీసీబీ మళ్లీ నష్టాల్లోకి వస్తుండటంతో ఆందోళన కలిగిస్తోంది.

రుణాల పంపిణీ వేగవంతం చేస్తాం



సహకార బ్యాంకుల్లో రుణాల పంపిణీని వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. త్వరలో కొత్త పథకాలను ప్రారంభిస్తున్నాం. కంప్యూటరీకరణ జరుగుతుండటంతో రుణాల పంపిణీపై పూర్తి స్థాయిలో దృష్టి సారించలేదు. రుణాల రికవరీకి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం. కంప్యూటరీకరణ త్వరలో పూర్తి సేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– విజయ్‌కుమార్, సీఈఓ, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్

న్యూస్‌రీల్

పోలీసు అమరవీరుల త్యాగాలు ఎనలేనివి

- కొవ్వొత్తుల ర్యాలీలో జిల్లా ఎస్పీ బిందు మాధవ్



కొవ్వొత్తుల ర్యాలీలో ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు (టౌన్): పోలీసు అమరవీరుల త్యాగాలు ఎనలేనివని ఎస్పీ బిందు మాధవ్ చెప్పారు. గురువారం రాత్రి కర్నూలు పట్టణంలో పోలీసు అమరవీరులను స్మరిస్తూ కర్నూలు పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో ఎస్పీ పాల్గొని పోలీసు పరేడ్ మైదానంలో ఉన్న పోలీసు అమరుల స్మారక చిహ్నం వద్ద నివాళులర్పించారు. కర్నూలు కొండారెడ్డిబురుజు మీదుగా పెద్దమార్కెట్, అంబేడ్కర్ విగ్రహం వరకు పోలీసు బ్యాండ్ మధ్య ఈ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహించనున్నట్లు సీఈఓ నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ కార్యాలయంలోని మినీ సమావేశ భవనంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఏడు స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. స్థాయీ సంఘాలకు కేటాయించిన సమయాన్ని అనుసరించి గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, విద్య, వైద్యం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, ఆర్థిక, ప్రణాళిక, పనులకు సంబంధించిన శాఖలపై సమీక్షించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశాలకు స్థాయీ సంఘాల చైర్ పర్సన్లు, సభ్యులు, అధికారులు తమకు కేటాయించిన సమయానికి హాజరు కావాలని సీఈఓ కోరారు.

స్క్రీనింగ్ టెస్ట్ 10కి వాయిదా

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల ఉచిత మెగా డీఎస్సీ కోచింగ్‌కు సంబంధించి ఈ నెల 3వ తేదీన నిర్వహించాల్సిన స్క్రీనింగ్ టెస్ట్‌ను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జే రంగలక్ష్మీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకున్న వారు 10వ తేదీన నిర్వహించనున్న స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరు కావాలని ఆమె కోరారు.

శ్రీ మఠానికి రూ. 7 లక్షలు విరాళం

మంత్రాలయం: మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన శ్రీనాథ్ రూ 2 లక్షలు, అదే విధంగా విద్యాదానానికి నెల్లూరుకు చెందిన సుబ్బరామశర్మ రూ. 5 లక్షలు విరాళంగా అందజేసినట్లు శ్రీమఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ వెంకటేష్‌జోషి తెలిపారు. దాతలు వేర్వేరు సమయాల్లో గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీరాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి శ్రీమఠం పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థ స్వామి వారు శేషవస్త్రం కప్పి, ఫలమంత్రాక్షితలిచ్చి ఆశీర్వదించారు.

అమరజీవి త్యాగం చిరస్మరణీయం



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న జేసీ డాక్టర్ బి.నవ్య తదితరులు

కర్నూలు(సెంట్రల్): అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని, తెలుగుజాతి ఔన్నత్యాన్ని కాపాడిన త్యాగమూర్తి అని జేసీ డాక్టర్ బి.నవ్య అన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి జేసీ నవ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటలక్ష్మమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ డాక్టర్ బి.నవ్య మాట్లాడుతూ.. తెలుగు మాట్లాడే వారికి తెలుగు రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహార దీక్షలో ప్రాణాలను కోల్పోవడంతో 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. తరువాత తెలంగాణతో కలపి 1956 నవంబర్ 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ అవతరించిందన్నారు. దేశంలో ఆంధ్రప్రదేశ్‌కు తొలి భాష ప్రయుక్త రాష్ట్రంగా అవతరించిన రికార్డు ఉందన్నారు. ఈ క్రమంలో త్యాగధనుల స్ఫూర్తితో అధికారులు ప్రజలకు ఉత్తమైన సేవలు అందించాలన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. మునిసిపల్ కమిషనర్ రవీంద్రబాబు అంతకముందు జేసీ డాక్టర్ బి.నవ్య చిల్డ్రన్స్ పార్కులోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల అర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రవీంద్రబాబు, కలెక్టరేట్ ఏఓ విజయశ్రీ పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్ అన్నారు. వెల్దుర్తిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఉదయమే ప్రార్థన సమయానికి పాఠశాలకు చేరుకున్న ఆయన విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ ఏడాది పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంగా ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని హెచ్ఎం చంద్రావతికి సూచించారు.

రైతులకు భరోసా ఏదీ?

- ఇప్పటి వరకు పంట పెట్టుబడి సాయం లేదు.. ఉచిత పంటల బీమా లేదు
- స్థానికంగా ఉపాధి పనులు లేక పేదలు వలసబాట పట్టారు
- కూటమి పాలన తీరుపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి ఆగ్రహం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, చిత్రంలో పార్టీ నాయకులు

కర్నూలు (టౌన్): 'ఖరీఫ్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులు, తర్వాత అధిక వర్షాలతో పంటలు పండక రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. కష్ట సమయంలో వారికి తోడుగా నిలిచి ఆదుకోవాల్సిన కూటమి సర్కారు పట్టనట్లు వ్యవహరిస్తోంది' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి ఐదునెలలు దాటుతున్నా రైతులకు పైసా సాయం చేయలేదన్నారు. చివరకు గత ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని కూడా ఎత్తివేసిందన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు రైతులకు ఏటా రూ.20 వేలు పెట్టుబడి సాయం చేస్తానని నమ్మించి అధికారంలోకి వచ్చాక అమలు చేయడం లేదన్నారు. శుక్రవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ హాలులో ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు ఐదేళ్ల పాటు ప్రతి సంవత్సరం రైతు భరోసా పేరుతో రూ.13, 500 పంట పెట్టుబడి సాయం, ఉచిత పంటల బీమా అందించి ఆదుకున్నారన్నారు. కూటమి సర్కారు పంట బీమా భారం రైతులపైనే వేసిందన్నారు. ఐదు నెలల పాలనలో రూ.59 వేల కోట్లు అప్పు తీసుకువచ్చిన బాబు సర్కారు రైతు సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. జిల్లాలో ఫీల్డ్ అసిస్టెంట్లతో కలిసి కూటమి నాయకులు బోగస్ హాజరుతో ఉపాధి హామీ నిధులను స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. దీంతో స్థానికంగా పనుల్లేక పొట్టచేతబట్టుకొని మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాల్లోని వ్యవసాయకూలీలు, రైతులు ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారన్నారు. ప్రస్తుతం కష్టపడి పండించిన ఉల్లి పంటను అమ్ముకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారని, రోజుల తరబడి మార్కెట్ యార్డులో ఎదురుచూస్తున్నారన్నారు. జిల్లా మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు కనీసం వారి వద్దకు వెళ్లి సమస్యను తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదన్నారు.

మద్యం, ఇసుక దందాలో బిజీ

ఓ వైపు మద్దతు ధర లేక పండించిన పంట అమ్ముకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మరో వైపు మంత్రులు, ప్రజా ప్రతినిధులు మద్యంలో వాటాలు, ఇసుక దోపిడీలో బిజీగా ఉన్నారని ఎస్వీ మోహన్‌రెడ్డి విమర్శించారు. అధికారపార్టీ నాయకులు సంపాదనలో పడి ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారన్నారు. పార్టీ కోడుమూరు ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, నగరపాలక డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకా మాట్లాడుతూ కూటమి సర్కారుకు మద్యం వ్యాపారంపై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలపై లేదన్నారు. పేదలు మద్యం బాగా తాగి ఆరోగ్యం పాడు చేసుకోవాలని విచ్చలవిడిగా మద్యం షాపుల ఏర్పాటుకు లైసెన్స్‌లు ఇచ్చిందని విమర్శించారు. ఇప్పటికైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన మహిళలకు ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సుహామీ ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలన్నారు. సమావేశంలో పార్టీ నేతలు షరీఫ్, జుబేర్, యూనుసూ బాషా, కిషన్ పాల్గొన్నారు.

కష్టాలు కని'పింఛన్'

- ఇంటింటికీ పింఛన్ 30 శాతమే
- సచివాలయాలు, రచ్చబండల వద్దే పంపిణీ
- అవస్థలు పడిన లబ్ధిదారులు



నందవరం మండలం జొహరాపురంలో పింఛన్ల కోసం వేచివున్న లబ్ధిదారులు



మండల కేంద్రం నందవరం సచివాలయం-2 వద్ద పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్న వృద్ధులు



హోలహర్వి మండలం విరుపాపురంలో చెట్టు వద్ద పింఛన్ కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారని ప్రభుత్వం చెప్పుకుంటున్నా... ఆచరణలో అది నామమాత్రానికే పరిమితమవుతోంది. పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఇంటి దగ్గరే చేపట్టేందుకు నియోజక వర్గాల వారీగా స్పెషల్ ఆఫీసర్లను పురమాయించినప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. జూలై నుంచి అక్టోబరు నెల వరకు సాగిన తరహాలోనే నవంబరు నెల కూడా అస్తవ్యస్తమైంది. ఈ సారి సర్వర్ పనిచేయకపోవడంతో మధ్యాహ్నం వరకు పింఛన్ల పంపిణీ ముందుకు సాగలేదు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల వరకు సచివాలయ ఉద్యోగులు ఎవ్వరూ లబ్ధిదారుల ఇంటి వద్దకు రాకపోవడంతో అవ్వతాతలు, వికలాంగులు ఇతర పింఛన్‌దారులు గ్రామ, వార్డు సచివాలయాల మెట్లు ఎక్కాల్సి వచ్చింది. రచ్చబండల దగ్గర పడిగాపులు కాశారు. పింఛన్ పొందడంలో అవ్వతాతలకు మరోసారి తలప్రాణం తోకకు వచ్చింది. కొందరు సచివాలయ ఉద్యోగులు ఉదయం గంట, రెండు గంటల పాటు ఇంటి దగ్గరకే వెళ్లి పంపిణీ చేసినా.. తర్వాత ఒకేచోట పంపిణీ చేపట్టారు. సాయంత్రం 6 గంటల సమయానికి కర్నూలు జిల్లాలో 95.72 శాతం, నంద్యాల జిల్లాలో 94.39 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. కర్నూలు జిల్లాలో 2,41,029 పింఛన్లు ఉండగా 2,30,702 పంపిణీ చేశారు. 95.72 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు స్పష్టమవుతోంది. నంద్యాల జిల్లాలో 2,17,375 పింఛన్లు ఉండగా... 2,05,182 పంపిణీ చేశారు. 94.39 శాతం పంపిణీ అయింది. వివిధ కారణాలతో మిగిలిపోయిన వారికి మాత్రం 2వ తేదీ పంపిణీ చేస్తారు.

మహిళలకు అండగా నిలుస్తాం

- మంత్రి టీజీ భరత్

కర్నూలు(సెంట్రల్): మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి అండగా నిలుస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారం శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో దీపం-2 పథకం జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రితో పాటు ఎంపీ బి.నాగరాజు తప్పా ఎమ్మెల్యేలు ఎవరూ రాలేదు. కాగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంపై ఉన్నతంగా మాట్లాడాలని, సీఎం చంద్రబాబునాయుడు, మంత్రిని పొగడ్తలతో ముంచెత్తాలని ముగ్గురు మహిళలకు రెండు రోజులుగా అధికారులు తర్ఫీదు ఇచ్చారు. అయితే వారు మైకు తీసుకోగానే మధ్యలోనే విరమించారు. గత ప్రభుత్వ హయాంలో రూ. వేలకు వేలు తీసుకొని ఇప్పుడు వచ్చే రూ.858తో జీవితాలు మారిపోతాయన్న విధంగా చెప్పాలంటే ఎందుకో వారికి వారికే మనసు ఒప్పలేదు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఎస్ఓ రాజారఘువీర్, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరక్టర్ లక్ష్మీనారాయణ, ఏఎస్ఓ రామాంజనేయరెడ్డి పాల్గొన్నా రు. గూడూరులో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, పాణ్యంలో ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారు.

యురేనియం తవ్వకాలను చేపట్టనీయం



సమావేశమైన గ్రామాల ప్రజలు

- తీర్మానం చేసిన పది గ్రామాల ప్రజలు

దేవనకొండ: యురేనియం తవ్వకాలను ఎట్టి పరిస్థితుల్లో చేపట్టనీయమని ఆయా గ్రామాల ప్రజలు తీర్మానించారు. ఈ మేరకు శుక్రవారం కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టులోని కొలుట్ల చెన్నకేశవస్వామి ఆలయ ఆవరణలో కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టుకి చుట్టుపక్కల ఉన్న కప్పట్రాళ్ల, పి.కోటకొండ, బేతపల్లి, చెల్లెలచెలిమల, దిబ్బనగుర్తి, నెల్లిబండ, జిల్లెడబుదకల, మాదాపురం తదితర గ్రామాల ప్రజలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యురేనియం తవ్వకాలను అడ్డుకునేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెచ్చేలా చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. దాదాపు 3 వేల మందికి పైగా ప్రజలు సమావేశమయ్యారు. తమ గ్రామాలను కాపాడుకోవడమే ప్రధాన లక్ష్యంగా పోరాడుతామన్నారు. ఒకప్పుడు ఫ్యాక్షన్‌కు నిలయంగా ఉన్న కప్పట్రాళ్ల, దాని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నేడు అన్ని వదిలి పాడి పంటలు, పిల్లాపాపలతో సుఖంగా జీవిస్తున్నామన్నారు. ఇక్కడ యురేనియం తవ్వకాలు చేపడితే తాము వివిధ రకాలైన సమస్యలను ఎదుర్కొంటామని, ఎలాంటి తవ్వకాలు చేపట్టరాదన్నారు.

క్లుప్తంగా

త్రుటిలో తప్పిన ప్రమాదం



సైడ్ వాల్‌ను ఢీకొని ఆగిన కారు

ఆదోని అర్బన్: పట్టణంలోని పాత ఓవర్ బ్రిడ్జి సైడ్ వాల్‌ను కారు ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది. కారు ఆలూరు వైపు నుంచి ఆదోని పట్టణం వైపు వస్తుండగా అదుపు తప్పి వంతెనపై ఉన్న సైడ్ వాల్‌ను ఢీకొంది. దీంతో వాల్‌భాగం కొంత దెబ్బతిని కింద పడింది. వేగానికి కారు కూడా కిందపడిపోయి ఉంటే వంతెన కింద వ్యాపారాలు చేసుకునే వారికి ప్రమాదం జరిగేది. సిమెంట్ దిమ్మెలు పడగానే అక్కడున్న వ్యాపారులు భయాందోళన చెందారు. అయితే, కారు డ్రైవర్ ఆపకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

యువతి ఆత్మహత్య

బండి ఆత్మకూరు: పెళ్లి ఇష్టం లేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. మండలంలోని పరమటూరు గ్రామంలో గురువారం ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సాయిబాబారెడ్డికి నలుగురు కుమార్తెలు. చిన్న కుమార్తె కొణిదెల జ్యోతి (32)ని వివాహం చేయాలని భావించాడు. ఈ విషయం కుమార్తెకు చెప్పాడు. పెళ్లి ఇష్టంలేక పోవడంతో ఆ యువతి ఇంట్లో ఒక గదిలోకి వెళ్లి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. అక్కడే పంచనామా నిర్వహించి మృత దేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. ఈమేరకు తండ్రి సాయిబాబా రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చే సుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

అవుకు: మండల పరిధిలోని ఓబుళాపురం గ్రామంలో కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. శుక్రవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఓబుళాపురం గ్రామానికి చెందిన జీనిగె శివరామయ్య (27) గురువారం రాత్రి గ్రామ సమీపంలో మూత్ర విసర్జనకు వెళ్లాడు. అక్కడ చెరువు కాలువలో ప్రమాదవశాత్తు పడ్డాడు. ఉదయాన్నే గడ్డి కోయటానికి వెళ్లిన గ్రామ మహిళలకు శవమై కనిపించడంతో కుటుంబీకులకు సమాచారమిచ్చారు. మృతుడికి రెండేళ్ల క్రితం వెల్దుర్తికి చెందిన మహాలక్ష్మితో వివాహం జరిగింది. నాలుగు నెలల వయస్సు ఉన్న కుమార్తె ఉంది. పుట్టింటి దగ్గర ఉన్న భార్యకు విషయం తెలియడంతో హుటాహుటిన గ్రామానికి చేరుకొని భర్త మృతదేహాన్ని చూసి బోరున విలపించింది.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని..



మృతి చెందిన నాగన్న

ఓర్వకల్లు: కర్నూలు-కడప జాతీయ రహదారిపై గురువారం గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఎస్‌ఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. రామళ్లకోట గ్రామానికి చెందిన నాగన్న(65) మతిస్థిమితం లేక వివిధ ప్రాంతాల్లో నడుచుకుంటూ తిరిగేవాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం స్వగ్రామం నుంచి హుసేనాపురంలోని తన సోదరిని చూసేందుకు వెళ్లాడు. గురువారం జాతీయ రహదారి వెంట ఓర్వకల్లు వైపు నడుచుకుంటూ వెళ్లుతుండగా, స్థానిక పవర్ గ్రిడ్ సంస్థ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరక మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

కార్తీకం.. దివ్య శోభితం!

- నేటి నుంచి కార్తీక మాస ఉత్సవాలు
- శైవ క్షేత్రాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు
- దీపాన్ని దైవ స్వరూపంగా భావిస్తూ పూజలు
- కార్తీక సోమవారాల్లో ఆలయాలను సందర్శించనున్న లక్షలాది మంది భక్తులు



విద్యుత్ దీపాలంకరణలో శ్రీశైల ఆలయం

కర్నూలు కల్చరల్/శ్రీశైలంటెంపుల్: కార్తీక మాసం హిందువులకు ప్రీతి పాత్రమైన మాసం. ఈ నెల రోజులను అత్యంత పవిత్రమైన రోజులుగా భావిస్తారు. ఈ మాసంలో దైవ భక్తితో ఉంటే ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు కలుగుతాయన్నది భక్తులు ప్రగాఢ విశ్వాసం. అందుకే ఈ మాసంలో మహిళలు వ్రతాలు, నోములు ఆచరిస్తారు. మరోవైపు కార్తీక మాసంలో దీపారాధనకు ఎంతో ప్రాధాన్యం ఉంది. దీపారాధన అనేక శుభ ఫలితాలు కలుగజేయడమే గాకుండా అంతులేని ఆరోగ్యభాగ్యాలను ఇస్తుందని భక్తుల నమ్మకం. దీపాన్ని దైవ స్వరూపంగా భావించి పూజలు చేస్తారు. కార్తీక సోమవారాల్లో చేసే దీపారాధన, ఉసిరి చెట్టు కింద పూజలు వన భోజనాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పండితులు చెబుతున్నారు. ఈనెల 2వ తేదీ నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుంది. ఈ మాసంలో నాలుగు వారాల పాటు పూజలు కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి.

దీపారాధన ప్రత్యేకత

కార్తీక మాసంలో ఒక్కో రకమైన ప్రమిదలో దీపం వెలిగిస్తే ఒక్కో రకమైన మంచి జరుగుతుందని శాస్త్రాల్లో పేర్కొన్నారు. మట్టి ప్రమిదలో వెలిగిస్తే దైవానుగ్రహం కలుగుతుందని, పింగాణి ప్రమిదలో వెలిగిస్తే ఆ ఇంటి వారికి అలంకరణ వస్తువులు సమకూరుతాయని, ఇత్తడి ప్రమిదల్లో దీపాలు వెలిగిస్తే ఆ ఇంట్లో దైవ శక్తి అధిక మవుతుందని, కంచు ప్రమిదల్లో వెలిగిస్తే ఆయుష్షు పెరుగుతుందని, నిమ్మ ప్రమిదల్లో వెలిగిస్తే అన్ని కార్యాల్లోనూ విజయం సిద్ధిస్తుందని, అరటి దొన్నెలో దీపం వెలిగించి నీటిలో వదిలితే మానసిక సంతృప్తి, ధన రక్షణ కలుగుతుందని, ఉసిరి కాయల దీపం వెలిగిస్తే పాపాలు తొలగిపోతాయని భక్తులు నమ్మకం.

శివకేశవులకు సమ ప్రాధాన్యం

కార్తీక మాసం శివుడికి, విష్ణువుకి ప్రీతికరమైంది. అందుకే ఈ మాసంలో ప్రతి సోమవారం శివుడికి, ప్రతి శుక్ర, శనివారాల్లో విష్ణుమూర్తికి ప్రత్యేక పూజలు చేస్తారు. శివపార్వతుల పుత్రుడు అయ్యప్ప దీక్షలు ఈమాసంలోనే ప్రారంభమవుతాయి. శివుడికి రుద్రాభిషేకం, బిల్వార్చనలు, విష్ణువుకి తులసీ దళార్చనలు ఈ మాసంలోనే అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. లక్ష్మీదేవి, కార్తికేయుడు, చంద్రుడు, ఇంద్రుడు, తులసీమాత, ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేయడం కూడా ఆనవాయితీగా వస్తోంది. కార్తీక మాసంలో కార్తీక స్నానం, దీపారాధన, ఉపవాసం, దానధర్మాలు, సోమవార వ్రతాలు ముఖ్యమైనవి. ఈ మాసంలోవన భోజనాలకు ఎంతో విశిష్టత ఉంది. నెల రోజుల పాటు జరిగే కార్తీక ఉత్సవాల్లో శివ-పార్వతుల సృష్టిగా పిలవబడే ఉసిరి చెట్టును పూజించి అక్కడ వన భోజనాలు చేస్తే పుణ్య ఫలం సిద్ధిస్తుందనేది భక్తుల నమ్మకం.

శైవాలయాల్లో ఆధ్యాత్మిక శోభ

ఉమ్మడి జిల్లాలోని శ్రీశైలం, మహానంది, యాగంటి, ఓంకారం, భోగేశ్వరాలయం, కాల్వబుగ్గ, సంగమేశ్వరం, రుద్రకోడూరులోని క్షేత్రాల్లో కార్తీక మాస పూజలు విశేషంగా జరుగుతాయి. వీటితోపాటు అహోబిలం, మంత్రాలయం, ఉరుకుంద క్షేత్రాల్లో పూజలు జరుగుతాయి. శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీక పౌర్ణమి రోజున జ్వాలాతోరణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. కర్నూలు నగరంలో నగరేశ్వరస్వామి ఆలయం, సప్తగిరినగర్ కైలాసగిరి ఆలయం, అశోక్ నగర్ ప్రసన్నాంజనేయ ద్వారకామాయి ఆలయం, శివరామాలయం, శ్రీరామనగర్ శివాలయం, బుధవారపేట ఈశ్వరాంజనేయస్వామి ఆలయం, మాధవ నగర్‌లోని సీతారామాలయం, కొత్తపేటలోని ఈశ్వరాంజనేయ స్వామి తదితర ఆలయాల్లో కార్తీక మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు.

కార్తీక మాసం పర్వదినాలు

- 2వ తేదీన కార్తీక స్నాన ఆరంభం, బలి పాడ్యమి, ఆకాశ దీప వ్రత ఆరంభం
- 3న యమ ద్వితీయ, భగినీ హస్త భోజనం, చిత్ర గుప్త జయంతి, ధన్వంతరి జయంతి.
- 4న త్రిలోచన గౌరీ వ్రతం
- 5న నాగుల చవితి, వల్మీక పూజ, గరుడ పంచమి
- 8న యజ్ఞ వల్క జయంతి, కార్తవీర్యార్జున జయంతి
- 9న గోష్టాష్టమి వ్రతం
- 10న అక్షయ నవమీ వ్రతం
- 12న బోధనేకాదశి
- 13న క్షీరాబ్ధి ద్వాదశి, చిలుకు ద్వాదశి, చాతుర్మాస వ్రత సమాప్తం.
- 14న వైకుంఠ చతుర్దశి
- 15న కార్తీక పౌర్ణమి, జ్వాలా తోరణం
- 16న వృశ్చిక సంక్రమణం
- 19న సంకష్ట హర చతుర్థి
- 26న ఏకాదశి ➤ 28న యమప్రీతి దీప దానం ➤ 29న మాస శివరాత్రి
- డిసెంబర్ 1న అవాస్య కార్తీక మాస వ్రత సమాప్తి
- 2న పోలి స్వర్గం, నదులలో దీపాలు వదలడం.

శ్రీగిరిలో నేటి నుంచి కార్తీకమాసోత్సవాలు..

పరమశివుడు స్వయంభులింగంగా వెలసిన శ్రీశైలమహాపుణ్యక్షేత్రంలో సోమవారం నుంచి కార్తీక మాసోత్సవాలు వైభవంగా ప్రారంభంకానున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు భారీగా తరలి వచ్చి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని దీపారాధన చేసుకుంటారు. ఈ మాసంలో ప్రతి సోమవారం కనుల పండువగా లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి, కార్తీకపౌర్ణమి రోజున కృష్ణానది వద్ద పుణ్యనదీహారతి, జ్వాలా తోరణం విశేషంగా జరుపుతారు. కార్తీకమాసం పురస్కరించుకుని శ్రీగిరికి తరలివచ్చే భక్తులకు దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది.

కార్తీక మాస పూజలతో అనంత పుణ్య ఫలం



కార్తీక మాసంలో సర్వదేవతలను పూజించడంతో అనంత పుణ్య ఫలం సిద్ధిస్తుంది. అత్యంత పవిత్రమైన ఈమాసం శివకేశవులకు ప్రీతికరం. సూర్యోదయానికి ముందు స్నానం, దీపారాధన, శివకేశవుల అర్చన, కార్తీక సోమవారాల వ్రతం, తులసీపూజ ధాత్రిపూజ, కార్తీక వనభోజనాలు, యథాశక్తి దాన ధర్మాలు చేసినట్లైతే సర్వ శుభాలు కలుగుతాయి. కార్తీక పౌర్ణమి రోజున దీపాలను వెలిగిస్తే దోషాలు తొలగిపోతాయి. దీపాలను నదిలో వదలటం శ్రేయస్కరం. పరమేశ్వరునికి 11, కాలసర్పదోషానికి 212, మాంగళ్య దోషానికి 21, శనిదోషానికి 9, గురు దోషానికి 33, కళత్ర దోషానికి 108, దుర్గాదేవికి 9, పుత్ర దోషానికి 51, సర్పదోషానికి 48, రాహు దోషానికి 21 దీపాలు వెలిగిస్తే మంచి ఫలితాలు సిద్ధిస్తాయి.

– పి.చంద్రశేఖర శర్మ, పండితులు

మృత్యువులోనూ వీడని స్నేహం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం
- టపాసులు తీసుకుని బైక్‌పై వెళ్తుండగా అల్లుగుండు వద్ద ఘటన
- మృతుల్లో ఒకరు సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్, మరొకరు ప్రైవేట్ ఉపాధ్యాయుడు
- సి. బెళగల్ మండలం కొండాపూర్ గ్రామంలో విషాదం



అల్లుగుండు వద్ద రహదారి పక్కన గుంతలో పడి మృతిచెందిన అనిల్, మునిస్వామి



సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ అనిల్‌కుమార్ (ఫైల్)



చిన్న మునిస్వామి (ఫైల్)

వెల్దుర్తి(కృష్ణగిరి)/సి. బెళగల్: వారిద్దరు స్నేహితులు. ఒకే గ్రామం. ఎక్కడికైనా కలిసే వెళ్లేవారు. చివరికి మృత్యువులోనూ వారు స్నేహం వీడలేదు. వివరాల్లోకి వెళితే.. సి. బెళగల్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పెద్ద మల్లకల్లు, లలితమ్మ దంపతులు పెద్ద కుమారుడు అనిల్‌కుమార్(32), చిన్న మౌలాలి, సంతోషమ్మ దంపతుల చిన్న కుమారుడు మునిస్వామి (35) ఇద్దరు మిత్రులు. వరుసకు వీరు మామా అల్లుళ్లు కూడా. అనిల్‌కుమార్ మణిపూర్‌లో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా, మునిస్వామి డోన్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. దీపావళి పండగ ఉండటంతో వారం రోజుల క్రితం అనిల్‌కుమార్ స్వగ్రామానికి వచ్చాడు. ఈయనకు వెల్దుర్తికి చెందిన సువర్ణతో వివాహం జరిగింది. శుక్రవారం వీరి పెళ్లి రోజు కావడంతో భార్యను చూసేందుకు కర్నూలులో బాణసంచా కొనుగోలు చేసి డోన్‌లో నివాసముంటున్న మిత్రుడు మునిస్వామితో కలిసి రాత్రి ఏడున్నర గంటల సమయంలో బైక్‌పై వెల్దుర్తికి బయలుదేరారు. అనిల్‌కుమార్ బైక్ నడుపుతుండగా మునిస్వామి వెనుక కూర్చున్నాడు. అయితే, వెల్దుర్తి మండల పరిధిలోని అల్లుగుండు స్టేజీ సమీపంలో వీరి బైక్‌ను వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ఎగిరి రహదారి పక్కన ఉన్న ఇనుప చువ్వలకు తగిలి గుంతలో పడి ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం ఉదయం పాదయాత్రగా శబరిమలకు వెళ్తున్న భక్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మునిస్వామికి భార్య వాణి, ఇద్దరు కుమార్తెలు ఉండగా అనిల్‌కుమార్‌కు భార్య సువర్ణ, ఇద్దరు కుమారులున్నారు. ఒకే కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు.

వైభవంగా స్వాతి వేడుకలు



మద్దిలేటి స్వామిని ఊరేగిస్తున్న వేదపండితులు

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వాతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆశ్వయుజ మాసాన్ని పురస్కరించుకొని ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో వేదపండితులు కళ్యాణ చక్రవర్తి శ్రీదేవి, భూదేవి సమేతుడైన మద్దిలేటిస్వామికి సుప్రభాత సేవ, వాసు దేవ పుణ్యాహవచనం, సుదర్శన హోమం, నవ కలశస్నపనం, నరసింహహోమం, పంచామృత సహిత విశేష ద్రవ్య తిరుమంజనం, ధన్వంతరి మూల మంత్ర జపం నిర్వహించారు. అనంతరం అలంకార ప్రియుడైన స్వామిని శ్రీదేవి, భూదేవి సమేతంగా ప్రత్యేక పుష్పాలంకరణలో ఉంచి ఆలయ మాడ వీధుల్లో మంగళవాయిద్యాల మధ్యన ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, ప్రధాన అర్చకుడు మద్దిలేటి స్వామి, అర్చకులు మనోహర్, రాఘవయ్య, మద్దిలేటిస్వామి పాల్గొన్నారు.

రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. ఆర్.శారదజయలక్ష్మి

ఎమ్మిగనూరురూరల్: వ్యవసాయంలో రాణించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ శారదజయలక్ష్మి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆమె సందర్శించారు. సందర్శనలో విధుల పరిశీలన, సాంకేతిక ప్రణాళికలు అమలుపై శాస్త్రవేత్తలతో చర్చించారు. అనంతరం కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా. కె. రాఘవేంద్రచౌదరి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, రైతులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి మార్కెటింగ్, నాణ్యమైన విత్తనాలు, జీవన ఎరువులు, అద్దె పరికరాల భవనాలను ఏర్పాటు చేసుకొని స్వయం సమృద్ధి సాధించాలని చెప్పారు. యంత్రీకరణలో భాగంగా కేవీకేలో వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి డ్రోన్‌లను అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. సమీకృత వ్యవసాయ పద్ధతులను పాటిస్తే నష్టాలను అధిగమించవచ్చున్నారు. శాస్త్రవేత్తలు రైతులకు అందుబాటులో ఉండి వారికి పంటల సాగులో సలహాలు, సూచనలు అందించాలని చెప్పారు. పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించి జీవన ఎరువులు, సేంద్రియ ఎరువుల వాడకం పెంచే విధంగా చూడాలని సూచించారు. సమావేశంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు, కర్నూల్ మండల ఏఓ శశిధర్‌రెడ్డి, పెద్ద కడుబూరు ఏఓ వరప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

- రూ.2.50లక్షల అస్తినష్టం



కాలిబూడిదైన ఇంట్లోని సామగ్రి

దొర్నిపాడు: విద్యుదాఘాతంతో మండలకేంద్రం దొర్నిపాడులో ఒక ఇల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన బోయ లక్ష్మి రోజులాగే బుధవారం సీడ్ పత్తి క్రాసింగ్ పనులకు వెళ్లింది. సాయంత్రం బడి నుంచి వచ్చిన పిల్లలు ఇంట్లో పొగరావడాన్ని గమనించారు. తల్లి లేకపోవడంతో వెంటనే ఇరుగు పొరుగువారికి చెప్పారు. అప్పటికే మంటలు వ్యాపించి ఇంట్లో సామగ్రి, తిండిగింజలు, దుస్తులు కాలి బూడిదయ్యాయి. ఇంట్లో దాచుకున్న రూ.70వేల నగదుతో పాటు తులం బంగారు గొలుసు కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంతో సుమారు 2.50 వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితురాలు వాపోతుంది. నంద్యాల పార్లమెంట్ రైతు సంఘం నాయకుడు సిద్ది సత్యం బాధితురాలికి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. అలాగే వాల్మీకి సంఘం మండల ప్రెసిడెంట్ రామదాజు, కార్యదర్శి బాల ఉసేని బాధితురాలికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

పిడుగు పడి ఎద్దు మృతి

ఆస్పరి: మండలంలోని అట్టెకల్లు గ్రామంలో లింగన్న అనే రైతుకు చెందిన ఎద్దు పిడుగు పాటుకు గురై మృతి చెందింది. మండలంలోని ఆస్పరి, బిల్లేకల్లు, అట్టెకల్లు, ఐనకల్లు గ్రామాల్లో గురువారం ఉరుములు, మెరుపులతో ఓ మోస్తారు వర్షం కురిసింది. లింగన్న తన ఎద్దులను పొలంలో కట్టేశాడు. వాటి వద్దే పిడుగు పడడంతో అక్కడక్కడే ఓ ఎద్దు మృతి చెందింది. మరో ఎద్దుకు గాయాలయ్యాయి. పక్కనే ఉన్న రైతు లింగన్న భార్య గోవిందమ్మ కాలికి సైతం గాయాలు కావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఎద్దు మృతితో రూ.50వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని లింగన్న వేడుకుంటున్నారు.



అట్టెకల్లులో పిడుగు పాటుకు మృతి చెందిన ఎద్దు

పాముకాటుకు బాలుడి మృతి



బాలుడి మృత దేహం వద్ద రోదిస్తున్న తల్లి దండ్రులు

పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామంలో ఓ బాలుడు పాముకాటుకు గురై మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. బాలయేసు, మాధవిలకు కుమారుడు, కుమార్తె సంతానం. కుమారుడు బోయ మహిధర్ నాయుడు(8) దీపావళి పండుగ కావడంతో టపాసులు కాల్చేందుకు శుక్రవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వస్తున్నాడు. కాంపౌండ్ గోడ బొర్రలో దాగి ఉన్న పాము ఆ పిల్లాడి కాలుకు కాటువేసింది. వెంటనే ఆ బాలుడు విషయం తల్లికి తెలియజేయగా ఆమె పాము కోసం ఆ ప్రాంతమంతా గాలించారు. కనిపించకపోవడంతో వెంటనే కుమారుడిని మండల కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌కు అవకాశం

కర్నూలు (సెంట్రల్): ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్ చేసేందుకు ఐటీఐ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ నజీర్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు www.apprenticeshipindia.gov.in అనే వెబ్‌సైట్‌లో నవంబర్ 5 నుంచి 19వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో మొత్తం డీజిల్ మెకానిక్‌కు సంబంధించి 35, మోటర్ మెకానిక్‌కు సంబంధించి 4, ఎలక్ట్రీషియన్ 4, వెల్డర్ 1, పెయింటర్ 1, ఫిట్టర్ 1, డ్రాఫ్ట్‌మెన్ 1 మొత్తం 47 ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్ అప్లికేషన్‌తో పాటు రూ.118 రుసుం చెల్లించి కర్నూలులోని ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాలలో సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.

టీడీపీ నాయకుల అరాచకం

- ఆంజనేయస్వామి భక్తురాలిపై దాడి
- దేహశుద్ధి చేసిన గ్రామస్తులు


డోన్/ప్యాపిలి: తెలుగుదేశం పార్టీ నాయకుల అరాచకాలు పెరిగిపోతున్నాయి. అమాయక ప్రజలపై దాడులు, దౌర్జన్యాలకు తెగబడుతున్నారు. గురువారం ఏకంగా ఆంజనేయ స్వామి ఆవహించే మహిళతో పాటు ఆమె భర్తపై దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టారు. వివరాల్లోకి వెళితే.. డోన్ పట్టణానికి చెందిన దూదేకుల రోజాబీ అనే మహిళకు ఆంజనేయ స్వామి ఆవహిస్తుంటాడని భక్తుల నమ్మకం. ప్రతి మంగళవారం ఆమె చిన్నపొదిళ్ల గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తుంటారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు కోరికలు చెప్పుకొని అవి నెరవేరితే మొక్కులు చెల్లిస్తుంటారు. ఇదిలా ఉండగా డోన్‌లో ఉంటున్న టీడీపీ నాయకులు వైఈ నాగరాజు గౌడు, ఎల్లాగౌడు తదితరులు గతనెలలో మద్యం షాపు కోసం టెండర్ వేశారు. లక్కీడ్రాలో తమకు దుకాణం దక్కితే చిన్నపొదిళ్లలో ఆంజనేయ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న తమ సోదరి చిట్టెమ్మ ఇంటిని గుడికి రాసిస్తామని రోజాబీకి చెప్పారు. కోరుకున్నట్టే జరగడంతో ఇటీవల ఆమెను కలిసి త్వరలోనే ఇంటిని గుడికి రిజిస్ట్రేషన్ చేసిస్తామని వాగ్దానం చేశారు. అయితే, చిట్టెమ్మ భర్త తరపు బంధువులైనా టీడీపీ నాయకులు రమేష్‌గౌడు, రాంభూపాల్ గౌడు, చరణ్ గౌడు, రామయ్య గౌడు, సుజాత తదితరులు దీన్ని జీర్ణించుకోలేక గురువారం ఆంజనేయ స్వామి గుడి వద్దకెళ్లి రోజాబీ, దస్తగిరి దంపతులపై దాడులకు తెగబడ్డారు. రోజాబీని మహిళ అని చూడకుండా అసభ్య పదజాలంతో తిడుతూ ఆమె జుత్తు పట్టుకుని గుడి బయటకు ఈడ్చుకొచ్చి కొట్టారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడకు చేరుకుని టీడీపీ నాయకులను సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. వినకపోవడంతో గ్రామస్తులందరూ ఏకమై వారిని దేహశుద్ధి చేశారు. కాగా తనపై జరిగిన దాడి గురించి రోజాబీ ప్యాపిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పడిపోయిన ఉల్లి ధర

- నష్టాలు మూటగట్టుకున్న రైతులు
- అక్టోబరు 29వ తేదీ వచ్చిన ఉల్లి మూడు రోజుల పాటు కొనుగోలు
- సరుకు కుళ్లిపోవడంతో ధరపై తీవ్ర ప్రభావం
- నేడు, రేపు మార్కెట్‌లో క్రయవిక్రయాలు బంద్



మార్కెట్‌లో ఉల్లి దిగుబడులు



కుళ్లిన ఉల్లి గడ్డలను ఏరివేస్తున్న కూలీలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి ధర ఒక్కసారిగా పడిపోయింది. అక్టోబరు 31వ తేదీ వరకు క్వింటాలు ఉల్లి ధర రూ.4000 పలికింది. ఉన్నట్టుండి శుక్రవారం గరిష్ఠ ధర ఏకంగా రూ.1,859కి పడిపోయింది. ఉల్లిగడ్డలు మురిగిపోయినందున ధర లభించలేదని మార్కెట్ కమిటీ అధికారులు సెలవిస్తున్నారు. అయితే, సరుకు కొనుగోలులో మార్కెట్ కమిటీ అధికారులు చేసిన జాప్యం చేయడమే ఇందుకు కారణమని రైతులు చెబుతున్నారు. అక్టోబరు నెల 29వ తేదీ రాత్రి నుంచి వచ్చిన ఉల్లి గడ్డలను 30, 31, 1వ తేదీల్లో మూడు రోజుల పాటు కొనుగోలు చేశారు. సరుకు ఎక్కువగా వచ్చినప్పుడు ఉదయం 9 గంటలకే టెండరు ప్రక్రియ చేపట్టి ఉంటే ఒకే రోజు పూర్తి అయ్యేది. అక్టోబరు 26వ తేదీన 24,372 క్వింటాళ్లు రాగా ఒకే రోజు టెండరు వేశారు. 29వ తేదీ రాత్రి నుంచి వచ్చిన సరుకును మూడు రోజుల పాటు కొనుగోలు చేశారు. వరుసగా మార్కెట్‌లోనే 4 రోజులు ఉల్లిగడ్డలు ఉండిపోవడం వల్ల పంట దెబ్బతినింది. గ్రేడింగ్ మీద, గ్రేడింగ్ చేసి క్వింటాలుకు 10కిలోలకు పైగా పారబోశారు. టన్నుకు క్వింటాలు వరకు పారబోయాల్సి వచ్చింది. అక్టోబరు 29వ తేదీ దాదాపు 25,438 క్వింటాళ్లు మార్కెట్‌కు రాగా.. 30న 12883 క్వింటాళ్లు, 31న 10,885 క్వింటాళ్లు, 1వ తేదీన 1670 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. రోజుల తరబడి మార్కెట్‌లోనే సరుకు ఉండిపోవాల్సి రావడం వల్ల ఉల్లి నాణ్యత దెబ్బతినడంతో ధర పడిపోయింది. కనిష్ఠ ధర రూ.495, గరిష్ఠ ధర రూ.1,859 మాత్రమే లభించింది. సగటు ధర రూ.1000 నమోదు అయింది. ఎక్కువ మంది రైతులకు రూ.500 నుంచి రూ.1500 వరకు మాత్రమే లభించడం తీవ్ర ఆందోళన కలిగించింది. మార్కెట్‌లో నాలుగు రోజులున్నా నష్టాలే మూటగట్టుకొని వెళ్లాల్సి వచ్చిందని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

ఎటు చూసినా కుళ్లిన ఉల్లిగడ్డలే..

మార్కెట్‌లో ఎటు చూసిన కుళ్లిపోయిన ఉల్లి కనిపిస్తోంది. ఎప్పటికప్పుడు ఏరివేసిన ఉల్లిగడ్డలను ఎక్కడబడితే అక్కడ పడేస్తున్నారు. కాల్వలు నిండిపోయాయి. దీంతో దుర్గంధం వెల్లువెత్తుతోంది.

సోమవారమే ఉల్లి క్రయవిక్రయాలు..

మార్కెట్ యార్డులో ఈ నెల 2, 3 తేదీల్లో ఎలాంటి వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరగవు. 4వ తేదీ నుంచి మార్కెట్‌లో ఉల్లికొనుగోళ్లు చేపడుతారు. 2,3 వ తేదీల్లో కొనుగోలు చేసిన ఉల్లిని బయటకు పంపడం, మరోవైపు క్లీనింగ్ చేయడం చేస్తారు. 4 నుంచి యథావిధిగా కొనుగోలు జరుగుతాయని సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. 3వ తేదీ 12 గంటల నుంచి 4వ తేదీ ఉదయం 8 గంటల వరకు మాత్రము మార్కెట్‌లోకి ఉల్లిగడ్డలను అనుమతిస్తామని పేర్కొన్నారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో జరుగుతున్న ఉల్లి క్రయవిక్రయాలను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత గురువారం పరిశీలించారు. కలెక్టర్‌తో మాట్లాడి యార్డును విశాలమైన ప్రదేశంలోకి తరలించేందుకు చర్యలు తీసుకుంటామని రైతులకు తెలిపారు.